
# పాపం ప్రజలు!

— శంకరమంచి పార్థసారథి —




విష్ణుమూర్తి పాల సముద్రంలో ఆదిశేషుడి నీడన రిలాక్సవుతున్నాడు.

లక్ష్మీదేవి ఆయన పాదాల చెంత కూర్చుని, భర్త సేవ చేసుకుంటోంది. ఇంకా దేవతలు, వందిమాగధులు ఎంతో మంది నిశ్శబ్దంగా కూర్చుని విష్ణుమూర్తిని తదేక దృష్టితో చూస్తున్నారు. ఆ సమయంలో ఎవ్వరికీ ఆయనతో మాట్లాడే అధికారం గాని, ధైర్యంగాని లేవు. ఎందుకంటే ఆ సమయంలో సృష్టి విచారణ జరుగుతుందని అందరికీ తెల్సు కనుక.

కళ్ళు మూసుకుని దీర్ఘాలోచనలో వున్న విష్ణుమూర్తి పెదవుల పై చిరునవ్వొకటి తళుక్కున మెరసింది. ఆయన నవ్వటమన్నది సామాన్య విషయం కాదని, ఏదో పెద్ద విశేషముంటేనే గాని ఆయన చిరు మందహాసం చిందించరని అందరికీ తెల్సినా, 'ఏమిటని' అడిగే ధైర్యం లేక అందరూ అలాగే చూస్తుండిపోయారు.

లక్ష్మీదేవి మాత్రం ధైర్యంగాను, చొరవగాను అడిగింది-



"ఏమిటి స్వామీ! మీ కంతగా నవ్వు తెప్పించిన విషయం? మేము తెల్సుకోవచ్చా?"

భార్య గొంతుక విని కళ్ళు తెరిచిన విష్ణువు నిశ్చలంగా శూన్యం లోకి చూస్తూ, "ఏమీ లేదు దేవీ! భూలోకంలో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. అక్కడి నాయకులు అధికార దాహంతో కళ్ళు మూసుకుపోయి మరీ చిన్న పిల్లల్లాగా ప్రవర్తిస్తున్న తీరు తల్చుకుంటే నవ్వాగింది కాదు. ప్చ్!" నిర్లిప్తంగా బదులిచ్చాడు లక్ష్మీపతి.

అంతలోనే అక్కడికి వచ్చింది భూదేవి. ఆమె కురులు విరబోసుకుంది. కళ్ళు బాధవల్ల కాబోలు- చింత నిప్పుల్లా వున్నాయ్.

ఎప్పుడూ ప్రసన్నంగా, ప్రశాంతంగా వుండే ఆమె వదనం వెల వెల పోతోంది. సహనానికి మారు పేరైన ఆమె చాలా అసహనంగా వుంది.

ఆమె వస్తూనే, "దేవాధి దేవా! ఆపద్బాంధవా! శరణు- శరణు! రక్షించు" అనుకుంటూ వచ్చింది.

విష్ణుమూర్తి యధావిధిన అభయ హస్తం చూపించి, "ఏం తల్లీ! నీ కొచ్చిన కష్ట మేమిటి?" అనడిగాడు.

భూదేవి తలొంచుకుని మెల్లిగా అంది- "మీకు తెలీనిదేముంది స్వామీ! ఈ భూ భారాన్ని మోయ లేకుండా వున్నాను. పాపం రోజు రోజుకి, గంట గంటకి పెరిగి పోతోంది. నాకీ బాధనుంచి, భారం నుంచి విముక్తిని ప్రసాదించు."

విష్ణుమూర్తి తన పాదాల చెంత కూర్చున్న లక్ష్మిని ఓరకంట చూసి, మళ్ళీ భూదేవితో, "అమ్మా! సహనానికి నీవు మారుపేరు కదా! నీవే ఇలా బెంబేలు పడితే, ఓర్పుకి, సహనానికి మరి తావెక్కడ? సృష్టి లోని మిగతా జీవుల మాటేమిటి? అయినా, గతంలో రావణుడుని, హిరణ్యకశిపుడుని, దుర్యోధనాది కురు పుత్రులని, వాలి అను యాయుల్ని, వాళ్ళందరూ చేసిన పాపకార్యాలని సహనంగా ఓర్చుకుని, సహనంలో నీకు నీవే సాటి వని పేరు గాంచిన నీవు, కేవలం సామాన్య మానవుల గూర్చి ఎందుకింత కలత?"

భూదేవి దిగులుగా బదులిచ్చింది— "స్వామీ! మీరు తెలీక మాట్లాడుతున్నారో, తెల్సికూడా నాతో హాస్యం ఆడుతున్నారో తెలీదు గాని, భూలోక వాసులు అందరిలాంటి వారు కారు. మీరన్నట్లు సృష్టి జరిగాక నేనెంతో మంది క్రూరుల్ని, పాపుల్ని చూశాను, వాళ్ళ పాపాలు మోసాను. కాని ఇలాంటి స్వార్థ పరులని, ఆత్మవంచన చేసుకునే వాళ్ళని చూడలేదు. బొత్తిగా పాప భీతి లేని వాళ్ళు."

విష్ణుమూర్తి తాపీగా ప్రశ్నించాడు- "ఆ మనుషులవల్ల నీ కొచ్చి పడిన కష్టమేమి?"

"భూలోకంలో ఎన్నికలొచ్చాయ్. త్వరలో జరుగబోతున్నాయ్. ఆకస్మికంగా ఎన్నికలని రప్పించటానికి, ఆ వచ్చిన ఎన్నికల్లో నెగ్గటానికి వాళ్ళ నాయకులు చేస్తున్న నీతిమాలిన పనులతోను, స్వార్థ పూరితమైన ఉపన్యాసాలతోను నా తల వేగిపోతోంది. నన్ను మీరే కాపాడాలి!" మొర

పెట్టుకుంది భూమాత దీనాతిదీనంగా.

విష్ణువు చిరు మందహాసం చిందించి, భూదేవితో- "అమ్మా! చింతిల్లకు. నేను-బ్రహ్మ, మహేశ్వరులతో కూడా సంప్రదించి, నీ కష్టాన్ని తొలగించి, భారాన్ని తగ్గించే మార్గం ఆలోచిస్తాను. అప్పటివరకు శాంతించి, సహనం చూపించు!" భూలోకంలో మంత్రిగారు తనింటికి వూరేగింపుగా వచ్చిన ప్రతి వాళ్ళకి హామీ ఇచ్చినట్లుగా, రొటీన్‌గా అనేశాడు.

భూదేవి నమస్కరించి శెలవు తీసుకుంది.

ఆమె అటు వెళ్ళగానే సేవకుడిని పిల్చి, "తక్షణం సూర్య చంద్రులని పిల్చుకురండి!" ఆజ్ఞాపించాడు విష్ణుమూర్తి.

మిగతా దేవతలందరూ జరుగుతున్న తంతుని అతి వుత్సాహంగాను, ఆశ్చర్యంగాను తిలకిస్తున్నారు.

కొద్ది క్షణాల్లోనే సూర్యచంద్రులిద్దరూవచ్చి నమస్కరించి, చేతులు కట్టుకుని నిల్చున్నారు.

వాళ్ళని చూసి విష్ణువు-"ఇప్పుడే భూదే వొచ్చి వెళ్ళింది. భూలోకంలో పరిస్థితి చాలా దారుణంగా వుందనీ, తనకి విముక్తిని ప్రసాదించమనీ మొరపెట్టు కెళ్ళింది. మీరిద్దరూ ప్రతి రోజూ ఒకరి తర్వాత ఇంకొకరు భూమిని కనిపెట్టు కుంటారు. కనుక అక్కడ జరుగుతున్న దేమిటో నాక్కావాలి. అక్కడ పాపాలు పెరిగి పోవటానికి కారకు లెవరు? కారణా లేమిటి?" ఆదుర్దాగా అడిగాడు.

ఆ మాట విని సూర్యచంద్రులు మొహాలు చూసుకున్నారు.

సూర్యుడు మెల్లగా అన్నాడు- "ఆ మనుష్యులకి నే నంటే సరి పడదు. నా వంక కూడా చూడరు. అందువల్ల వాళ్ళతో నాకు సాన్నిహిత్యం చాలా తక్కువ. వాళ్ళ గూర్చి చంద్రుడుకి బాగా తెల్సు. అతడు వాళ్ళకీ మధ్య మరీ లోకువయ్యాడు."

"అంటే?" లక్ష్మి ప్రశ్నించింది అర్థంకాక.

చంద్రుడు సిగ్గు పడుతున్నవాడిలా మెల్లగా బదులిచ్చాడు- "ఏం చెప్పమంటావ్ తల్లీ! వాళ్ళ విషయంలో చాలా సహనంగా వుంటూ వచ్చాను. నా మీద కవిత్వం రాశారు, కథల్లారు- కాదన్లేదు. నన్ను ఆడపిల్ల మొహంతో పోల్చారు- పోనీ లెమ్మని వూరుకున్నాను. నాకు, కలువలతో లేనిపోని సంబంధాన్ని అంటగట్టారు. పిచ్చివాళ్ళని సరిపెట్టు కున్నాను.

ఇవన్నీ చాల వన్నట్లు సరాసరి నా మీదకి దండయాత్రకే బయల్దేరారు. అవేవో రాకెట్లుట—ప్రయోగిస్తు న్నారు. అవి విరామం, విసుగు లేకుండా అహర్నిశలు నా చుట్టూ తిరిగేస్తున్నాయి. ఇదిలా వుండగా స్కైలాబ్‌ట దాని పేరు-మూడు గదులు,ఒకచిన్న వంటగది, వరండా కలిగినచిన్న ఇంటినే ప్రయోగించారు. దాంట్లో ఇద్దరు మనుష్యులు కాపు రం కూడా వున్నారు. వాళ్ళిరవై నాలుగ్గంటలూ నా వంక చూట్టం, వాళ్ళ యంత్రాలతో ఫోటోలు తీయ టం, వాళ్ళ జెండాలు వదిలిపోవటం- ఒకటికాదు, రెండు కాదు-అనేకం. నా కీ మధ్య మరుగు లేకుండా పోయింది."

విష్ణుమూర్తి కంగారుగా అన్నాడు—"మరీ విషయాన్ని నా కిన్నాళ్ళు చెప్పావు కాదేం? అయినా ఇంతకి స్కైలాబ్ ఏమయింది? ఇంకా తిరుగుతూనేవుందా?"

చంద్రుడు, ప్రశ్నలన్నింటికీ సమాధానం కావాలంటే భూలో కంలో ఫలానా పిక్చర్ చూడమని అనకుండా మెల్లగా బదులిచ్చాడు- "చివరి కది వాళ్ళ నెత్తినే పడింది. మొన్నీ మధ్య దాన్ని గురించే భయ పడి చచ్చారు."

విష్ణువు గుండెల నిండా గాలి పీల్చుకుని యథాలాపంగా అన్నాడు. "దీన్నిబట్టి చూస్తే భూదేవి చెప్పిన దాంట్లో కాస్తయినా అతిశయోక్తి లేదనిపిస్తోంది. ఎక్కడో కొన్ని వేల యోజనాల దూరంలో వున్న నీకే మనశ్శాంతి లేకుండా చేస్తున్న వాళ్ళు, ఆమెకి బరువు, బాధ గాక మరేమవుతారు?"

సూర్యచంద్రుల నుద్దేశించి, "మీరెళ్ళి మీ పన్లు చూసుకోండి. దీనికి పరిష్కారమేమిటో మే మాలోచిస్తాము" అన్నాడు.

సూర్యచంద్రులు నిష్క్రమిం చారు. విష్ణువు భార్యతో అలా బయటి కెళ్ళి వస్తానని, తలుపులు జాగ్రత్తగా వేసుకోమని చెప్పి, సరాసరి కైలాసాని కెళ్ళాడు.

పరమేశ్వరుడితో భూదేవివచ్చిన విషయం, సూర్యచంద్రులిచ్చిన రిపోర్టులన్నీ పూసగుచ్చినట్లు, ఓట్లు లెక్కించినట్లుగా అతి జాగ్రత్తగా నివేదించి, "ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యమంటావు? మీ సలహా ఏమిటి?" అనడిగాడు.

అంతా సావధానంగా విన్న శివుడు రెండు క్షణాలు మౌనం తర్వాత మెల్లగా అన్నాడు- "భూలోకవాసుల తెలివితేటల్ని నేనెన్నడూ తక్కువ వంచనా వెయ్య లేదు. అసలు నిజం చెప్పాలంటే

వాళ్ళంటే నాకు కాస్త భయం కూడా వుంది. నేనసలే బోళా మనిషినని నీకు తెల్సుగా! అక్కడ నాకెంతో మంది భక్తులున్నారు. వాళ్ళ భక్తి ప్రపత్తులకి పరవశించి పోతున్నా, దర్శనం మాత్రం ఇవ్వటం లేదు. తీరా అక్కడికెడితే ఏ ఎన్నికల గొడవల్లో ఇరికిస్తారోనని భయపడి అన్నీ మానుకుని ఇలా కూర్చుండిపోతున్నాను. అయినా ఆపదల్లో ఆదుకోటం, చక్రం అడ్డం వెయ్యటం నీ కలవాటేగా! ఏదో ఒకటి ఆలోచించి నువ్వేచేసెయ్!'' డిప్లొమసీ ప్రదర్శించి తప్పుకున్నాడు.

అక్కడి నించి కదిలి బ్రహ్మలోకానికెళ్ళి, మళ్ళీ పాత పాటనే పాడాడు విష్ణువు.

బ్రహ్మ అంతా విని తనకేం పట్టనట్లు, "మనుష్యుల్ని సృష్టించటం వరకే నా డ్యూటీ. వాళ్ళ తెలివితేటలతోగాని, వాటివల్ల సంభవించే కష్టాలతోగాని నాకెటువంటి సంబంధం లేదు. మీరు పెద్దవాళ్ళు, ఏదో ఒకటి చెయ్యండి" అని రూలు పొజిషన్ మాట్లాడి తప్పుకున్నాడు.

విష్ణువు తిరిగి తన లోకానికొచ్చేసాడు. ఆ రాత్రంతా చాలా తీవ్రంగా ఆలోచించి ఆలోచించి- ఒక నిర్ణయానికొచ్చాడు.

మర్నాడుదయం అందరి సమక్షంలో తన నిర్ణయాన్ని ప్రకటించాడు-"భూదేవి చెప్పిన విషయాలని, సూర్యచంద్రుల అనుభవాలని, అభిప్రాయాలని దృష్టిలో వుంచుకుని, మానవలోకంలో వచ్చిపడిన ఎన్నికల దృష్ట్యా జరగబోయే అరిష్టాన్ని, పెరగబోతున్న పాపాన్ని అరికట్టి, ధర్మ స్థాపన చెయ్యట మెలాగాని తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను.

"నేను భౌతికంగా అవతారమెత్తి, ధర్మస్థాపన చేసే సమయమింకా రానందున, పరోక్షంగా- అంటే అదృశ్య రూపాన అక్కడికెళ్ళి, ఎన్నికల రోజున ప్రతి పోలింగ్ బూతులో వుంటాను. అక్కడ నేనుండటం వల్ల ఓటు వెయ్యటానికొచ్చిన ప్రతి వ్యక్తీ నిర్భయంగా, కులమత ప్రాతిపదికగా ఏర్పరచుకున్న కలుషితమైన నిర్ణయాల నావలికి నెట్టి, వాళ్ళ నాయకులు నూరి పోసిన అధర్మ ప్రచారా లన్నింటిని అధిగమించి, ధర్మానికే ఓటు వేస్తారు. అప్పుడు ధర్మం విజయం సాధిస్తుంది. దేశం సుభిక్షితం అవుతుంది. భూదేవికి తాత్కాలికంగా భారం తగ్గుతుంది."

అతడి నిర్ణయాన్ని విన్న దేవ

తలు గొప్పగా వుందని యధా విధిన స్తుతించారు.

భూలోకంలో ఎన్నికల ప్రచారం మొదలైంది.

ప్రతి పార్టీ అభ్యర్థులు ఎన్ని విధాల ప్రజలను ప్రలోభ పెట్టాలో అన్ని విధాల తమ తమ శక్తి మేరకు ప్రలోభ పెడుతున్నారు.

తెల్లవారితే ఎన్నికలు.

ఆ రాత్రి శ్రీమహావిష్ణువు లక్ష్మి వద్ద సెలవు పుచ్చుకుని అదృశ్య రూపాన భూలోకానికి బయల్దేరాడు.

భూలోకానికి వెళ్ళిన విష్ణువు ఎన్ని పోలింగ్ బూతులున్నాయో గుణించి, అన్ని భాగాలుగా మారి, ముందుగా వెళ్ళి ప్రతి కేంద్రం లోనూ ఓట్లు వేసే డబ్బా ప్రక్కనే పీఠం వేసుక్కూర్చున్నాడు.

ఆ రోజు తెల్లవారింది. సూర్యుడు మబ్బిలో వున్న గూఢ చారిలా హుషారుగా వున్నాడు.

పోలింగ్ మొదలైంది.

అదెవరి మహత్యమో- పోటీ చేస్తున్న నాయకులదో, పరలోకా న్నించి దిగొచ్చిన విష్ణుమూర్తిదో తెలీదుగానీ, పోలింగ్ ఎన్నడూ జరగనంత ఎక్కువగా జరిగింది.

విష్ణుమూర్తి పెట్టెలకి సీళ్ళు వేసే వరకు వుండి, అటు పిమ్మట తన భాగాలనన్నిటిని కలుపుకుని తిరిగి తన లోకం వెళ్ళిపోయాడు.

ఇక్కడ-ఇరవై హత్యలు, పది మాన భంగాలు, ముప్పై ఆరు దొమ్మీలు, నలభై చోట్ల కాల్పులు, పలుచోట్ల లాటీ చార్జీలు తప్పించి, ఎన్నికల కార్యక్రమం చాలా సాఫీ గాను, ప్రశాంతంగాను జరిగిందని భూలోక ప్రభుత్వం ప్రకటిస్తే, అక్కడ- విష్ణుమూర్తి ఎన్నికల కార్యక్రమం దిగ్విజయంగా జరిపిం చాననీ, ధర్మానికి విజయం తప్ప దనీ, తద్వారా భూదేవి కిచ్చిన మాట నిలబెట్టుకున్నాననీ ప్రక టించాడు.

ఎన్నికల ఫలితాల్ని తీసుకొచ్చే పని సాయంత్రం డ్యూటీ దిగే సూర్యుడి కప్పగించబడింది.

తెల్లవారింది. ఓట్ల లెక్కింపు మొదలైంది.

విష్ణువు తాపీగా భార్యతో పాచిక లాడుకుంటున్నాడు. దేవతలందరూ సాయంత్రం సూర్యుడు తెచ్చే వార్త కోసం ఎదురు చూడసాగారు.

కాలం బరువుగా, బాధగా కదిలి సాయంత్రాన్ని చేరుకుంది.

సూర్యుడు కాళ్ళీడ్చుకుంటూ వచ్చి, తప్పు చేసినవాడిలా తలొంచు కుని నిల్చున్నాడు.

అతడిని చూడగానే దేవతల్లో

ఒక్కసారిగా కలకలం బయల్దేరింది.

విష్ణువు ఆటలోంచి తలెత్తి సూర్యుడితో, "ఫలితాలొచ్చాయా? ధర్మమే నెగ్గిందికదా? మెజారిటీ ఎంతొచ్చింది?" తాపీగా అడిగాడు.

సూర్యుడు తలెత్తి ఆయన వంక జాలిగా చూసి మళ్ళీ తలొంచుకున్నాడు.

విష్ణువు మళ్ళీ- "ఫలితాలు తెల్సుకు రావటం మరిచావా? ఈవెనింగ్ ఎడిషన్స్ రాలేదా?" కొద్దిపాటి కుతూహలంగా అడిగాడు.

ఇంక లాభం లేదని సూర్యుడు మెల్లిగా అన్నాడు- "ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు. చెప్పటానికి నోరు రావటం లేదు. ఫలితాలొచ్చాయ్-అధర్మం పిచ్చి మెజారిటీతో నెగ్గేసింది."

"అదేలా సాధ్యం? అలా జరగటానికి వీల్లేదు!" విష్ణువు పెద్దగా అరిచాడు.

సూర్యుడు తాపీగా బదులిచ్చాడు- "అలాగే జరిగింది స్వామీ! నే చెప్పింది అక్షరాల నిజం. మీ కేమాత్రం సంకోచం వున్నా రేడియోలో బి. బి. సి. పెట్టుకు వినండి."

"నిజమెలా అవుతుంది? నేను సాక్షాత్తు దగ్గరుండి పోలింగ్ జరిపించాను. ప్రతి ఓటూ ధర్మానికే వేయించాను. ధర్మం గెల్చి తీరాలి-గెల్చితీరాలి!" పిచ్చిగా అరుస్తున్నాడు శ్రీమహావిష్ణువు.

అంతట్లో దేవతలందరిని తోసుకుంటూ బృహస్పతి ముందుకొచ్చి, "మన్నించండి మహాప్రభూ! నాకీ ఆలోచన మొన్నే వచ్చింది. మీకు చెబుదామనుకుంటూనే మర్చిపోయాను. అక్కడ భూలోకంలో ఎన్నికలు పూర్తికాగానే, ఆ రాత్రికి పెట్టెలు మార్చేస్తారట-అది వాళ్ళ ఆచారం, అలవాటుట. మీ కష్టం ఫలించక పోవటానికి కారణం బహుశా అదే కావొచ్చు!" చల్లగా చెప్పాడు.

ఎవ్వరికీ మాట్లాడే ధైర్యం చాలటంలేదు.

విష్ణుమూర్తి కళ్ళు మూసుకుని మెల్లిగా, 'పాపం-ప్రజలు! పాపం-భూదేవి! ఆమె భారం....ఎలా.... ఎలా?' గొణుక్కుంటున్నాడు.

ఆయనలా కళ్ళు మూసుకుని అధర్మాన్ని రూపు మాపేందుకు మరో పథకం తయారు చేస్తున్నాడనీ, అది పూర్తయితే గాని కళ్ళు తెరవడనీ దేవతలందరూ ఓపిగ్గా ఆయన కనువిప్పు కోసం ఎదురు చూస్తున్నారు.

కాని విష్ణుమూర్తి ఎంతకీ కళ్ళు తెరవలేదు. *